# పరాయి సిరా

అనువాద కథలు

స్వేచ్ఛానువాదం–మల్లాది వెంకట కృష్ణమూర్తి



## చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం  పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం  కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో 1950-1960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

# తర్కం మాష్టారు
## { బల్గేరియన్ కథకి స్వేచ్ఛానువాదం}
### రచన: బి. అలెక్సాండ్రా స్లోవిక్

**అది బల్గేరియాలోని సోఫియా నగరం.**

ఇంగ్లండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో మూడేళ్ళు లాజిక్ మీద పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్స్‌ని పూర్తిచేసి వచ్చిన ఆంద్రే, అక్కడి తన అనుభవాల గురించి మాట్లాడటానికి ఆ రోజు సాయంత్రం ఆ ఊళ్ళోని కల్చరల్ సెంటర్‌కి ఆహ్వానం మీద వచ్చాడు. ఈ కార్యక్రమం గురించి దినపత్రికల్లోని సాంస్కృతిక కాలంలో ప్రచురించడం వల్ల ఆ హాల్ నిండలేదు. ఆ సమయంలో మంచు కురుస్తూండటంతో వాకింగ్‌కి వచ్చినవారు తల దాచుకోవడానికి ఆ సెంటర్‌లోకి వచ్చి కూర్చోవడం వల్ల హాల్ నిండింది. ఒకరిద్దరు మాత్రమే ఆంద్రే చెప్పేది వినడానికి వచ్చారు.

దళసరి కళ్ళజోడు పెట్టుకుని, బ్రౌన్ రంగు సూట్‌ని ధరించి, ముందు భాగంలో సగం దాకా బట్టతలతో పరాకు ప్రొఫెసర్‌లా కనిపించే ముప్పై ఏళ్ళ ఆంద్రే ఓసారి తన శ్రోతల వంక చూసి ఫ్రెంచ్ భాషలో చెప్పాడు.

"గుడ్ ఈవినింగ్ ఎవ్విరిబడీ."

బల్గేరియాలో సగం మంది ఆ భాషని చక్కగా మాట్లాడగలరు.

"గుడ్ ఈవినింగ్" కొందరు జవాబు చెప్పారు.

కొందరు తాము చదివే ఈవెనింగ్ ఎడిషన్లలోంచి తల పైకెత్తి కూడా అతని వంక చూడలేదు.

"నన్ను ఇంగ్లండ్ గురించి మాట్లాడమన్నారు. ఇంగ్లండ్‌కి, మన దేశానికి మధ్య చాలా తేడాలు ఉన్నాయి. మన దేశంలో రోడ్డుకి ఎటుపడితే అటు వాహనాలని నడపచ్చు. అమెరికాలో కుడివైపే నడపాలి. కాని ఇంగ్లండ్‌లో మాత్రం రోడ్డుకి ఎడమ వైపే పోనివ్వాలి.

మన తల్లులు ఏపిల్ పైని ఇళ్ళల్లో చేసి పెడతారు. పిల్లలకి పాలు పడతారు. ఇంగ్లండ్‌లోని తల్లులు వాటిని దుకాణాల్లోంచి కొని తెస్తారు. ఇలా ఎంతైనా చెప్పచ్చు. మీరేదైనా టాపిక్‌ని సూచిస్తే దానిమీద మాట్లాడతాను. మీలో ఎవరైనా ప్రశ్నలు వేసి వెంటనే అనుమానాలు తీర్చుకోవచ్చు. చివరిదాకా ఆగక్కర్లేదు. అది మీరు నా ప్రసంగానికి అడ్డుపడటంగా నేను భావించను."

"మీ యూనివర్శిటీలోని ప్రొఫెసర్ల గురించి చెప్పండి. ప్రొఫెసర్ క్రిస్టోఫర్ మీకు తెలుసా?" ఒకతను అడిగాడు.

"తెలుసు. మీరు పేపర్ మడిస్తే చెప్తాను. మీరు అడిగిన క్రిస్టోఫర్ డ్రామా విభాగంలో ప్రొఫెసర్. ఇంకో క్రిస్టోఫర్ లేరు. ఆయన చెప్పిన కొన్ని కొటేషన్స్‌కి ప్రసిద్ధుడు. ఆయనకి నటీనటులంటే మంట. ఎవరికీ నటన రాదని ఆయన అభిప్రాయం. తన దగ్గర నటన నేర్చుకున్నవారే చక్కటి నటులు అవుతారనే అహంభావాం కూడా ఆయనలో ఉంది. ఓసారి ఆయన నటులని పశువులతో పోల్చాడు. 'మీరు నటులని పశువులుగా భావిస్తున్నారా?' అని ఎవరో అడిగితే 'కాదు. వారిని పశువుల్లా చూడాలని భావిస్తున్నాను' అని జవాబు చెప్పాడు. ఆయన మాటలకి షేక్స్‌పియర్ డ్రామాలు వేసే నట సంఘం ఆయన మీద విరుచుకుపడింది."

"ఇంతకీ మీ నటన మీద ఆయన అభిప్రాయం?" ఇంకొకరు పేపర్‌ని మడిచి అడిగారు.

"నేను డ్రామా కోర్స్ కాదు చదివింది. లాజిక్ కోర్స్ చేసాను."

"లాజిక్కా? అంటే?"

"అంటే తర్కం. మనకి అందుబాటులో ఉన్న చిన్న సమాచారాన్ని ఉపయోగించి, దాని వెనుక గల అనేక ఇతర సమాచారాలని సరిగ్గా తెలుసుకునే విద్య."

"మాకు అర్థం అయ్యేలా చెప్పండి."

"మీ పేరు?" ఆండ్రే అడిగాడు.

"స్టెఫానో" ఆ ప్రశ్న అడిగినవాడు జవాబు చెప్పాడు.

"మీరు అకౌంటెంట్. అవునా?" ఆండ్రే అడిగాడు.

"అవును. మీకెలా తెలుసు ఆ సంగతి?" స్టెఫానో ఆశ్చర్యంగా అడిగాడు.

"మీ జేబులో ఓ పెన్సిల్, రెండు రంగుల ఇంకుగల పెన్నులు కనబడుతున్నాయి. రంగు పెన్నులని అకౌంటెంట్ ఎంట్రీలని టిక్ పెట్టడానికి, పెన్సిల్‌ని టోటల్ వేయడానికి ఉపయోగిస్తాడు. కాబట్టి మీరు అకౌంటెంట్ అని గ్రహించాను. అకౌంటెంట్లు సాధారణంగా బ్రీఫ్‌కేసులని హోంవర్క్ చేయడానికి పుస్తకాలని ఇళ్ళకి తీసుకెళ్ళడానికి ఉపయోగిస్తారు. మీ పక్క సీట్‌లోని బ్రీఫ్‌కేస్ కూడా మీదే అని ఊహించాను. తెలిసిన కొంత సమాచారంతో మొత్తం సమాచారాన్ని కరెక్ట్‌గా ఇలా తెలుసుకోగలగడమే లాజిక్ అంటే" ఆండ్రే కొద్దిగా గర్వంగా చెప్పాడు.

"లాజిక్ దేనికి ఉపయోగపడుతుంది? స్టెఫానోని అకౌంటెంట్ అన్నట్లుగా మిమ్మల్ని ఏమంటారు?" ఇంకొకరు ఆసక్తిగా అడిగారు.

అప్పటికే అంతా పేపర్లని మడిచేసారు.

"బ్రిటీష్ వారు మమ్మల్ని లాజికల్ అనలైజర్ అంటారు. అమెరికన్స్ 'లాజికల్ సైంటిస్ట్' అంటారు. కాని 'లాజికల్ అనలైజర్' అన్నదే కరెక్ట్ అని నేను భావిస్తాను. ఎందుకంటే ప్రతీ నిజాన్ని సరిగ్గా గ్రహించగలగడమే కాక, అది ఎలా గ్రహించామో కూడా చెప్పగలగాలి. అప్పుడే అతను లాజికల్ అనలైజర్ అనిపించుకుంటాడు."

ఆంద్రే చెప్పేది అంతా ఆసక్తిగా వినసాగారు. అప్పటికే మంచు కురవడం ఆగిపోయినా ఎవరూ బయటకి వెళ్ళలేదు.

ఒకతను తన చేతిని ఎత్తి అడిగాడు.

"నా గురించి ఏదైనా చెప్పండి. మీ లాజిక్‌ని నా మీద ప్రయోగించండి."

"మీ పేరు?"

"బిల్లీ."

ఆంద్రే అతని వంక కొద్దిసేపు  దీక్షగా చూసాక అడిగాడు.

"మీ ఇంట్లో గోల్డ్ ఫిష్‌ని పెంచుతున్నారు కదూ?"

"అవును. మీకెలా తెలుసు ఈ సమాచారం?" బిల్లీ నివ్వెరపోతూ అడిగాడు.

"మీరు ధరించిన సూట్ కుట్టించింది తప్ప రెడీమేడ్ కాదు. ఈ నగరంలో అంత చక్కటి సూట్‌ని కుట్టేది ఒక్క టైటానియా సూట్స్ వారి దుకాణంలోనే. దాని పక్కనే చేపలు అమ్మే దుకాణం ఉంది. మీ సూట్‌ని వారు ఆల్టర్ చేయాల్సి వచ్చినప్పుడు మీరు ఆ పక్కనే ఉన్న చేపల దుకాణంలో మీ టైమ్ ని స్పెండ్ చేసి ఉంటారు. అక్కడి చేపలని చూస్తూంటే ఆ టైలరింగ్ షాపునించి ఎవరైనా వచ్చి మిమ్మల్ని పిలిచేదాకా బహుశ మీకు టైమ్ తెలిసి ఉండదు. దాంతో మీకు చేపలని పెంచాలని అనిపించి ఉంటుంది. ఒకటి, రెండుసార్లు మీరు వాటిని చూసాక తప్పక వాటిని కొని పెంచుకోడానికి ఇంటికి తీసుకెళ్తారు.

"కాని గోల్డ్ ఫిష్‌నే కొన్నానని మీకు ఎలా తెలుసు?"

"మొదటిసారి చేపలని పెంపకానికి కొనేవారు గోల్డ్ ఫిష్‌నే కొంటూంటారు. కాబట్టి ఆ భాగం తేలిగ్గా గ్రహించగలిగాను."

"వండ్రఫుల్! ఇంకా నా గురించి మీకేం తెలుసు?" బిల్లీ అడిగాడు.

"మీరు గోల్డ్ ఫిష్‌ని అద్దాల పెట్టెలో పెంచుతున్నారా? అవును లేదా కాదు అనే జవాబు చెప్పండి చాలు" ఆంద్రే అడిగాడు.

"కాదు."

"ఐతే మీ ఇంట్లో ఓ విశాలమైన తోట ఉంది" ఆంద్రే ఠక్కున చెప్పాడు.

"చేపలని పెంచితే గాజు అద్దాలపెట్టెలో పెంచుతారు. లేదా చిన్న నీటి గుంటలో పెంచుతారు. కాబట్టి మీ ఇంటి బయట చేపల పెంపకానికి కట్టిన నీటిగుంట ఉందనుకున్నాను. తోట లేకుండా నేనింతదాకా అలాంటి నీటిగుంటని బల్గేరియాలో ఎక్కడా చూడలేదు కాబట్టి అది తేలిగ్గా గ్రహించగలిగాను. పెద్దతోట ఉందంటే, మీకు తప్పనిసరిగా పెద్ద ఇల్లు కూడా ఉండి ఉండాలి."

"అవును. ఆరు పడకగదుల ఇల్లు నాది."

"మీకు పెళ్ళైంది. ముగ్గురు పిల్లలు కూడా."

"అవును. ఇది ఎలా చెప్పగలిగారు?"

"ఆరు పడకగదుల ఇల్లు మీరు బ్రహ్మచారైతే కట్టరు. కాబట్టి మీకు పెళ్ళయిందని గట్టిగా చెప్పగలను."

"కరెక్ట్. మరి ముగ్గురు పిల్లలు అని ఎలా గ్రహించారు?"

"మీ భార్య ఉత్తర ప్రాంతం నించి వచ్చిందని కూడా గట్టిగా చెప్పగలను."

"కరెక్ట్!"

"ఉత్తర ప్రాంతం వారు వేసుకునే టై ముడినే మీరు వేసుకున్నారు. మీ మాట తీరు దక్షిణ బల్గేరియాకి చెందింది. మరి ఉత్తర ప్రాంతపు టై ముడి మీరు ఎందుకు వేసుకుంటారు? మీ ఆవిడే ఆ టైని ప్రేమగా కట్టి పంపడం వల్ల. అవునా?"

"ఎక్సలెంట్! మీరు చెప్పిందంతా నిజం. మా అబ్బాయిని 'లాజికల్ అనలైజర్' కోర్స్‌ని చేయమంటాను. నాకు ముగ్గురు పిల్లలని ఎలా తెలుసుకున్నారు?" బిల్లీ ఉత్సాహంగా అడిగాడు.

"మీ భార్యకి మీరంటే ప్రేమ. లేకపోతే టై స్వయంగా కట్టదు. స్టాటిస్టిక్స్ ప్రకారం తనని ప్రేమించే భార్య గల భర్తకి ముగ్గురు లేదా ఎక్కువమంది పిల్లలు ఉంటారు. మీ ఇంట్లోని ఓ పడకగది మీది. మూడు పిల్లలవి. నాలుగు పోగా ఐదోది అతిథుల కోసం కేటాయించింది. కాబట్టి గదుల సంఖ్యని బట్టి ఇది తెలుసుకున్నాను."

"ఆరో గది నాలుగో సంతానానిదై ఉండచ్చుగా?" ఓ ప్రేక్షక కంఠం ప్రశ్నించింది.

"అది టివి రూం. ఆరు పడక గదులు గల ఎవరైనా ఓ గదిని టివి రూముగా చేసుకుంటారు. లేదా పిల్లల ఆట గది లైబ్రరీ గదిగా చేసుకుంటారు .టివి రూం చేసుకున్నారని గ్రహించలేదు. ఊహించానంతే."

అప్పటికే ప్రేక్షకులందరికీ ఆంద్రే మేధస్సు మీద గౌరవం కలిగింది. అతను చెప్పేది శ్రద్ధగా వింటూ మనసులో అతనిలోని లాజికల్ శక్తిని మెచ్చుకుంటున్నారు.

"మీరు వారానికి కనీసం మూడుసార్లు మీ భార్యతో సెక్స్‌లో పాల్గొంటారని కూడా గ్రహించాను" బిల్లీతో చెప్పాడు.

"నిజమే. కాని నాలుగు సార్లు."

"మీ భార్యకి మీ మీద గల ప్రేమవల్ల మీ మధ్య ఎక్కువసార్లు ఇంటర్‌కోర్స్ జరుగుతూంటుందని గ్రహించాను. మీ వయసువారికి మేగ్జిమమ్ ఇంటర్‌కోర్స్ జరిగేది వారానికి మూడు సార్లే. ఇప్పుడు మీకు లాజికల్ సైన్స్ అంటే తెలిసింది కదా? దీన్ని నేను ఇంగ్లండ్‌లో మూడేళ్ళపాటు అభ్యసించి వచ్చాను."

"ఈ చదువు చదివినవారికి ఎక్కడ ఉద్యోగం వస్తుంది?" ఒకరు అడిగారు.

"మిలటరీలో మాకు బాగా డిమాండ్ ఉంది. శత్రువుల మూమెంట్స్‌ని, యుద్ధంలో మాకు సరఫరా చేయబడ్డ సమాధానం ఆధారంగా కనిపెట్టగలం. ఏ సమయంలో ఎటువైపు నించి వారు అటాక్ చేస్తారో ముందే తెలిస్తే మంచిది కదా? ఇంకా కార్పొరేట్ రంగంలో వినియోగదారులకి సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఇస్తే వారిని ఎలా ఆకర్షించవచ్చో సరిగ్గా కనుక్కోగలం. యూనివర్శిటీల్లో ఈ సబ్జెక్ట్‌లో ప్రొఫెసర్లుగా కూడా ఉద్యోగం చేయచ్చు. మన దేశ ఫారిన్ పాలసీ విభాగంలో కూడా మాకు ఉద్యోగాలు ఉన్నాయి. లాజికల్ అనలైజర్ వల్ల మన ప్రభుత్వం చాలా దేశాలతో చక్కటి దౌత్యాన్ని చేయగలుగుతోంది."

ఒకతను వెనకనించి గట్టిగా చెప్పాడు.

"మిస్టర్ ఆండ్రే. మీ భార్య కొంతకాలంగా మిమ్మల్ని ప్రేమించడం విరమించింది అని లాజికల్‌గా నేను చెప్పగలను."

"ఎలా?" ఆండ్రే అతనెవరో తెలుసుకోవాలని ప్రయత్నిస్తూ అటువైపు చూస్తూ అడిగాడు. అతని మొహంలో ఆశ్చర్యం కనిపించింది.

"ఎలా అంటే మీకు ఆక్స్‌ఫర్డ్‌లో మూడేళ్ళు చదివేప్పుడు మీ భార్యని మీరు తీసుకెళ్ళి ఉండరు. డిపెండెంట్ వీసాతో ఆమెని తీసుకువెళ్ళి పోషించడానికి బల్గేరియా కన్నా ఇంగ్లండ్‌లో ఖర్చు ఎక్కువ కాబట్టి, మన దేశం నించి ఇంగ్లండ్‌కి ఎవరూ డిపెండెంట్స్‌తో వెళ్ళరు."

"అది కరెక్ట్ కావచ్చు. కాని నేను నా భార్యని నా వెంట ఇంగ్లండ్‌కి తీసుకెళ్ళనంత మాత్రాన ఆమె నన్ను ప్రేమించడం విరమించింది అని ఎలా చెప్పగలరు?"

"మీ ఆఖరి సంతానానికి మీరు తండ్రి కారు కాబట్టి."

అంతా నిశ్చేష్టులై ఆ మాటలు వచ్చినవైపు చూసారు. కాని అది మాట్లాడింది ఎవరో తెలుసుకోలేకపోయారు.

"ఇది మీకు ఎలా తెలుసు?" ఆండ్రే అవమానంతో ఎర్రబడ్డ మొహంతో అడిగాడు.

"మీ జుట్టు రంగు నలుపు. వాడిది గోధుమ రంగు జుట్టు. ఇంకా మీ కళ్ళు గోధుమ రంగు. వాడి కళ్ళు నీలం రంగు."

అతను తను పోస్టాఫీస్‌లో అనేకసార్లు చూసిన వ్యక్తి అని, ఒకే పోస్టాఫీసుని తాము ఇద్దరు ఉపయోగిస్తున్నామంటే అతను తన ఇంటి ఏరియాలోనే ఉంటాడని ఆండ్రే ఊహించాడు. ఆండ్రే మొహంలో రంగులు మారడం గమనించిన ఆ సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించిన అతను ఆండ్రేని సంప్రదించకుండానే సభ ముగిసిందని ప్రకటించాడు.

బయట మంచు కురవడం పూర్తిగా ఆగిపోవడంతో అంతా లేచి బయటకి నడవసాగారు. కొందరు లాజికల్ అనలైజర్ భార్య గురించి చెప్పింది నిజం అనుకుంటే, ఇంకొందరు కాదని చర్చించుకుంటూ బయటకి నడిచారు.

"అతను ఇంతటి లాజికల్ అనలైజర్ అయి వుండి కూడా ఆ విషయాన్ని గ్రహించలేదు. తనకి పనికిరాని విద్య వృధా కదా" బిల్లీ మిత్రుడు ఎగతాళిగా నవ్వుతూ చెప్పాడు.

"ఆయన భార్యకి మరో వ్యక్తితోగల సంబంధం గురించి నాకు ఎప్పుడో తెలుసు. కాని నీలా నేను బయటపడలేదు. నా భార్య పుట్టింటికి వెళ్ళినప్పుడు వారిద్దరూ మా ఇంట్లోని అతిథుల కోసం కేటాయించిన గదిలో కలుసుకునేవారు" బిల్లీ చెప్పాడు.

"అతని భార్య రహస్య ప్రియుడి పేరు?"

గోధుమ రంగు జుట్టు, నీలి కళ్ళు గల బిల్లీ జవాబు చెప్పకుండా సన్నగా నవ్వాడు.

**(వచ్చేనెల మరో కథ)**

COMMENTS